విస్తారా విమానంలో సాంకేతికలోపం

- 20 నిమిషాలు గాల్లోనే చక్కర్లు కొట్టిన పైలట్
- మరో విమానంలో ప్రయాణికుల తరలింపు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ) : శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి గురువారం సాయంత్రం టేకాఫ్ అయిన UK-880 విస్తారా విమానంలో టెక్నికల్ సమస్య తలెత్తింది. దీంతో పైలట్ 20 నిమిషాలపాటు గాల్లోనే చక్కర్లు కొట్టాడు. సాంకేతికలోపంతో అప్రమత్తమైన పైలట్ తిరిగి శంషాబాద్‌లోనే విమానాన్ని ల్యాండ్ చేశాడు. ఫ్లైట్‌లో 180 మంది ప్రయాణికులు ఉన్నారని, మెయింటనెన్స్ కారణంగానే అత్యవసర ల్యాండ్ అయినట్టు విస్తారా యాజమాన్యం ప్రకటించింది. ప్రయాణికులను వేరే ఫ్లైట్‌లో ఢిల్లీకి తరలించారు.

ఉత్కంఠ రేకెత్తించిన ఎయిర్ ఇండియా

తిరుచ్చిలో సురక్షిత ల్యాండింగ్

చెన్నై, అక్టోబర్ 11: తమిళనాడులోని తిరుచ్చిలో ఓ ఎయిర్ ఇండియా విమానం ఉత్కంఠకు గురి చేసింది. తిరుచ్చి నుంచి షార్జాకు వెళ్లేందుకు 141 మంది ప్రయాణికులతో శుక్రవారం సాయంత్రం 5.45కు బయలుదేరిన బోయింగ్ 737 విమానంలో కొద్దిసేపటికే హైడ్రాలిక్ వ్యవస్థలో సాంకేతిక లోపం ఏర్పడింది. దీంతో విమానాన్ని తిరిగి తిరుచ్చి ఎయిర్‌పోర్టులో ల్యాండింగ్ చేయాలని నిర్ణయించారు. అయితే ల్యాండింగ్ గేర్ పనిచేయకపోవచ్చునని భావించి ఇంధనం ఖాళీ కోసం విమానాన్ని రెండు గంటలపాటు గాలిలో చక్కర్లు కొట్టించారు. తర్వాత బెల్లీ ల్యాండింగ్ చేయించాలని నిర్ణయించగా ల్యాండింగ్ గేర్ పనిచేయడంతో రాత్రి 8.15 గంటలకు విమానం సురక్షితంగా తిరుచ్చి ఎయిర్‌పోర్ట్‌లోనే ల్యాండ్ అయ్యింది.

సోయా రైతుకు సర్కారు టోపీ!

- కేంద్రం కోటాలో కొనుగోలుకు మార్క్‌ఫెడ్ నిర్ణయం
- ఉత్పత్తి అంచనా 2.60 లక్షల టన్నులు..
- కొనుగోలుకు 56వేల టన్నులే అనుమతి
- మిగిలిన పంటపై చేతులెత్తేసిన రాష్ట్ర ప్రభుత్వం
- మ్యానిఫెస్టోలో ప్రకటించిన బోనస్ కూడా బోగస్సే
- పైగా పంట కొనుగోలుకు క్యాప్ నిబంధనలు
- ప్రభుత్వ నిర్ణయంపై సోయారైతుల ఆగ్రహం

ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు వచ్చిన సోయాబీన్

హైదరాబాద్/ఆదిలాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): మార్కెట్లో సోయాబీన్ ధర భారీగా పడిపోయింది. మద్దతు ధర క్వింటాలుకు రూ. 4892 ఉండగా మార్కెట్లో కేవలం రూ. 3500 నుంచి రూ. 4వేల లోపే ధర పలుకుతున్నది. ఎన్నికల సమయంలో పంట మద్దతు ధరకు అదనంగా రూ.450 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు బోనస్ సంగతి దేవుడెరుగు కనీసం మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు కూడా వెనకంజ వేస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కేంద్రం కోటాలోనే కొనుగోళ్లు...

సోయాబీన్ ధరలు పడిపోవడంతో పంట కొనుగోలుకు కేంద్రం అంగీకరించింది. కేంద్ర నిబంధనల ప్రకారం మొత్తం ఉత్పత్తిలో 25శాతం అనగా 56,550 టన్నుల సోయాబీన్ కొనుగోలుకు ఆదేశించింది. పంట కొనుగోలుకు మార్క్‌ఫెడ్ మొత్తం 37 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం అధికారులు 13 కేంద్రాలు ప్రారంభించి 50 టన్నుల సోయాబీన్ కొనుగోలు చేశారు. ఈ సీజన్‌లో సుమారు 4 లక్షల ఎకరాల్లో సోయాబీన్ పంట సాగు కాగా 2.60 లక్షల టన్నుల ఉత్పత్తి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. కేంద్ర ప్రభుత్వం 56వేల టన్నులు మాత్రమే కొనుగోలుకు ఆదేశించింది. అంటే మిగిలిన 2.04 లక్షల టన్నుల పంటను ఎవరు కొనుగోలు చేయాలనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. వాస్తవానికి మిగిలిన పంటను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలి. కానీ ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదు.

బోనస్ హామీ... బోగసేనా ?

ఎన్నికలకు ముందు సోయాబీన్ పంటలకు బోనస్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పొందుపరిచింది. నిరుడు మద్దతు ధర రూ. 3950 ఉండగా కాంగ్రెస్ పార్టీ రూ. 4400(రూ. 450 లేదా 11 శాతం బోనస్) లకు కొనుగోలు చేస్తామని ప్రకటించింది. ఈ లెక్కన ప్రస్తుతం సోయాబీన్ మద్దతు ధర రూ. 4892గా ఉండగా అదనంగా రూ. 450 బోనస్ కలిపి రూ. 5342కు కొనుగోలు చేయాలి. ఒకవేళ శాతం ప్రకారం లెక్కిస్తే రూ. 5430 ధరకు కొనుగోలు చేయాలి. కానీ ప్రభుత్వం ఏ ధరకూ కొనుగోలు చేయడం లేదు. అంతేగాక అసలే ధర లేక ఇబ్బంది పడుతున్న రైతులపై ప్రభుత్వం పిడుగు వేసింది. ఎకరాకు 6.52 క్వింటాళ్లను మాత్రమే కొనుగోలు చేయాలని నిర్ణయించింది. దీంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ క్యాప్ నిబంధనపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి కోతలు, క్యాప్ పెట్టకుండా మొత్తం పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

రూ.22 వేలు నష్టం..

నేను ఆరెకరాల్లో సోయా సాగు చేశా. ఎకరాకు 10 క్వింటాళ్లకు పైగా వచ్చింది. ఆరెకరాల్లో 65 క్వింటాళ్ల పంట తీశా. ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు సోయాను అమ్మకానికి తీసుకొచ్చా. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎకరాకు ఆరున్నర క్వింటాళ్లు మాత్రమే తీసుకుంటామని కొనుగోలు కేంద్రం సిబ్బంది అంటున్నారు. ఈ లెక్కన నేను 40 క్వింటాళ్ల పంటను మాత్రమే విక్రయించే అవకాశం ఉంది. మిగిలిన ఉత్పత్తులను ప్రైవేటు వ్యాపారులకు అమ్మాలి. సర్కారు నిర్ణయంతో రూ.22 వేలు నష్టపోవాల్సి వస్తున్నది.

- రాము, ఖోడద్, తలమడుగు

15 క్వింటాళ్లు మిగులుతుంది

నాలుగెకరాల్లో సోయా వేశా. 40 క్వింటాళ్ల పంటను ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు తీసుకొచ్చా. ఇక్కడ ఎకరానికి ఆరున్నర క్వింటాళ్లు మాత్ర మే కొంటామని అంటున్నారు. ఈ లెక్కన ఇంకా 15 క్వింటాళ్లు మిగులుతుంది. ప్రైవేటు వ్యాపారులకు అమ్మితే రూ.14 వేల నష్టం వస్తుంది. మార్కెటింగ్ సిబ్బంది 13 శాతం తేమ ఉన్నా పంటను తీసుకోవడం లేదు.

- తిరుమలేశ్, తంతోలి, ఆదిలాబాద్ రూరల్ మండలం

చిట్యాల వద్ద మంటల్లో దగ్ధమవుతున్న లారీ

బ్రిడ్జిని ఢీకొట్టిన లారీ.. పేలిన డీజిల్ ట్యాంకు

- మంటలు చెలరేగి దగ్ధం
- జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం

చిట్యాల, అక్టోబర్ 11 : సిమెంటు లారీ బ్రిడ్జిని ఢీకొట్టడంతో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటన శుక్రవారం ఉదయం నల్లగొండ జిల్లా చిట్యాలలో 65వ జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ వైపు నుంచి సిమెంటు లోడ్ లారీ హైదరాబాద్ వైపు వెళ్తున్నది. ఆ లారీ చిట్యాలలోని రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిని దాటిన తర్వాత ఉన్న బ్రిడ్జిని ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ డీజిల్ ట్యాంకు బ్రిడ్జికి తగిలి పేలిపోవటంతో మంటలు చెలరేగి లారీ దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. రోడ్డుపై లారీ దగ్ధం కావడంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దాంతో పోలీసులు ట్రాఫిక్‌ను ఒకే వైపు మళ్లించి, దగ్ధమైన లారీని అడ్డు తొలగించారు. ఈ ఘటనపై ఫిర్యాదు రానందున కేసు నమోదు చేయలేదని ఎస్సై తెలిపారు.

వీఎన్ఈఎస్ లైసెన్స్ రద్దు

యాజమాన్యం సందేశాలకు స్పందించొద్దు : మహబూబ్ కాలేజ్

హైదరాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): వెంకట్ నారాయణ ఎడ్యుకేషనల్ సొసైటీ (వీఎన్ఈఎస్) లైసెన్సును రద్దు చేసినట్టు మహబూబ్ కాలేజ్(మల్టీ పర్పస్ హైయర్ సెకండరీ స్కూల్ సొసైటీ) శుక్రవారం ప్రకటనలో వెల్లడించింది. స్వామి వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎస్‌వీఐటీ), స్వామి వివేకానంద పీజీ కాలేజ్(ఎస్‌వీపీజీ), బాల్టన్ స్కూల్ వంటి విద్యాసంస్థలు ఇప్పటివరకు వీఎన్ఈఎస్ ఆధ్వర్యంలో నడిచాయని, ప్రస్తుతం తమ నియంత్రణలోకి తీసుకున్నట్టు మహబూబ్ కాలేజ్ తెలిపింది. ఈ విషయంపై హైకోర్టును ఆశ్రయించగా అనుకూలంగా తీర్పు వచ్చినట్టు పేర్కొన్నది. వీఎన్ఈఎస్ అధ్యక్షుడు డాక్టర్ కేవీకే రావు, ఆయన కుమారుడుకే శ్రీహర్ష శశాంక్, సభ్యుల జోక్యం, బెదిరింపుల కారణంగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సి వచ్చినట్టు మహబూబ్ కాలేజ్ తెలిపింది. విద్యార్థులు, తల్లిదండ్రులు, బోధన, బోధనేతర సిబ్బంది వీఎన్ఈఎస్ సభ్యుల నుంచి వచ్చే సందేశాలకు స్పందించొద్దని సూచించింది.

మేం చెప్పినోళ్లకే పరిశ్రమల భూములు!

- మా ఇలాకాలో ఇవ్వాలంటే మేం ఒప్పుకోవాలె
- హుకుం జారీచేస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న పరిశ్రమ వర్గాలు

హైదరాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పాలనలో పరిశ్రమల ఏర్పాటు అత్యంత దుర్భరంగా మారింది. భూమి కొనుగోలు చేసి పరిశ్రమ పెట్టాలనుకునేవారికి చుక్కలు కనిపిస్తున్నాయి. టీజీఐఐసీ ద్వారా జరిగే భూకేటాయింపులు అర్హతల ఆధారంగా జరగడంలేదనే ఆరోపణలున్నాయి . స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలు తమ ఇలాకాలో తమకు తెలియకుండా ఎవ్వరికీ భూములు కేటాయించరాదని హుకుం జారీచేస్తున్నట్టు సమాచారం. దీంతో అధికారులు ఆయా జిల్లాల పరిధిలో మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి ఒక్కసారి చెప్పించుకుంటే పని అయిపోతుందని దరఖాస్తుదారులకు సెలవిస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో కనిపించని హుకుం జారీలు.. ఇప్పుడు పరిశ్రమ వర్గాలకు షాక్ తెప్పిస్తున్నాయి. పరిశ్రమ పెట్టాలనుకునేవారు ప్రాజెక్టు రిపోర్ట్‌తో ఆన్‌లైన్‌లో టీజీఐఐసీకి దరఖాస్తు చేసుకుంటే, వారి అర్హతల ఆధారంగా, వారు కోరుకున్న ఇండస్ట్రియల్ ఏరియాలో భూమి కేటాయించటం ఆనవాయితీ. కానీ, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఎవరికైనా భూములు కేటాయించాలంటే స్థానిక మంత్రి, లేక కాంగ్రెస్ ఎమ్మెల్యే చెప్తేనే భూకేటాయింపు జరుగుతున్నదని పరిశ్రమ వర్గాలు వాపోతున్నాయి.

మాకు తెలియకుండా భూములిస్తే ఊరుకోం

గత బీఆర్ఎస్ సర్కారు అభివృద్ధి చేసిన మేడ్చల్ సిద్దిపేట జోన్ – వర్గల్, ములుగు, కర్కపట్ల, బండ మైలారం, కర్కపట్ల, తునికి బొల్లారం, బండ మైలారం, బండ తిమ్మాపూర్, మాదారం, కొండాపూర్; సంగారెడ్డి పటాన్‌చెరు – పాశమైలారం, ఇంద్రకరణ్; రంగారెడ్డి– కొత్తూర్, ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల, రాకంచెర్ల, సుల్తాన్‌పూర్; ఖమ్మం– బుగ్గపాడు; వరంగల్–మదికొండ, టెక్స్‌టైల్ పార్క్; యాదాద్రి–వెలిమినేడు, దండుమల్కాపూర్ తదితర ఇండస్ట్రియల్ పార్కుల్లో భూముల కేటాయింపు జరుగుతున్నది. అయితే, వీటిలో భూములు పొందాలంటే అన్ని అర్హతలు ఉన్నా స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేల అనుమతి లేకుండా భూముల కేటాయింపు జరగటం లేదు. 'మా ప్రాంతంలో భూములు మేం చెప్పినవాళ్లకే కేటాయించాలి' అని ఇటీవల ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే అధికారులకు స్పష్టం చేయగా, 'మా ప్రాంతంలో మాకు తెలియకుండా ఎవ్వరికీ భూములు కేటాయించినా ఊరుకొనే ప్రసక్తే లేదు' అని ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే హుకుం జారీచేశారని పరిశ్రమ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఉమ్మడి రంగారెడ్డి, వరంగల్, ఖమ్మం తదితర జిల్లాల్లో కూడా ఇదే పరిస్థితి ఉన్నదని పేర్కొంటున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే పరిశ్రమల ఏర్పాటుకు ఎవరూ ముందుకు రారని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

బీఆర్ఎస్ హయాంలో ఈ దుస్థితి లేదు

టీఎస్ఐపాస్ వంటి విధానం ప్రపంచంలోనే ఎక్కడా లేదని పలు అంతర్జాతీయ కంపెనీలు ప్రశంసించాయి. పారదర్శకంగా భూములు కేటాయించడంతో పాటు సింగిల్ విండో విధానంలో అన్నిరకాల అనుమతులు ఇచ్చేవారు. బీఆర్ఎస్ హయాంలో కేటీఆర్ పరిశ్రమలశాఖ మంత్రిగా ఉండటంతో ఏనాడూ భూ కేటాయింపులో ఇబ్బందులు ఎదురు కాలేదని అధికారవర్గాలు చెప్పున్నాయి. తమపై ఎలాంటి ఒత్తిడి ఉండేది కాదని, భారీ పెట్టుబడులు ఉన్న కంపెనీలకు క్యాబినెట్ ద్వారా భూకేటాయింపులు జరిగితే, చిన్న కంపెనీలకు ఆన్‌లైన్ విధానంలో అర్హతలకు అనుగుణంగా కేటాయించేవారమని గుర్తుచేస్తున్నారు.

పండుగలకు ప్రత్యేక రైళ్లు

మణుగూరు-బెల్గావి మధ్య 190 సర్వీసులు

హైదరాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): పండుగల వేళ ప్రయాణికుల కోసం దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేస్తున్నది. దసరా, దీపావళి, ఛత్ నేపథ్యంలో మణుగూరు–బెల్గావి మధ్య 190 రైలు సర్వీసులను నడుపనున్నట్టు శుక్రవారం రైల్వే అధికారులు తెలిపారు. మణుగూరు నుంచి బెల్గావికి 95, తిరుగు ప్రయాణంలో కూడా 95 చొప్పున ప్రత్యేక రైలు ట్రిప్పులను నడుపనున్నారు. ఈ నెల 16 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు ఈ రైళ్లు రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు. కాగా, తిరుపతి–జల్నా మధ్య 8 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్టు అధికారులు వెల్లడించారు. ఈ నెల 13నుంచి నవంబర్ 4 వరకు ఈ రైళ్లు నడుస్తాయని తెలిపారు.

మొగులయ్య స్థలం ప్రహరీ కూల్చివేత

హయత్‌నగర్, అక్టోబర్ 11: ప్రముఖ కిన్నెర వాయిద్యాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మొగులయ్య స్థలంలోని ప్రహరీని గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి కూల్చివేశారు. హయత్‌నగర్ రెవెన్యూ సర్వే నెం.207లో 600 గజాల స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం మొగులయ్యకు కేటాయించిన విషయం తెలిసిందే. మొగులయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన హయత్‌నగర్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. తన స్థలాన్ని కాపాడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈడీ చేతికి 'యూ బిట్' వివరాలు

- దుబాయ్‌కి క్రిప్టో కరెన్సీ తరలింపుపై ఆరా
- ఇప్పటికే ఈ కేసులో 8 మంది టీచర్ల అరెస్టు
- ప్రభుత్వ ఉద్యోగులకు రూ.50 కోట్ల టోకరా

హైదరాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): నిర్మల్ జిల్లాలో వెలుగు చూసిన యూ–బిట్ కాయిన్ దందా వివరాలను ఆ జిల్లా ఎస్పీ ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులకు అందజేసినట్టు తెలిసింది. ఈ ఆన్‌లైన్ మోసంలో తీగలాగితే ఒక్కొక్కరి డొంకలు కదులుతున్నాయి. ఏడాదిన్నరగా సాగుతున్న ఈ దందాకు కొందరు ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు మధ్యవర్తులుగా వ్యవహరించడం మొదట్లోనే చర్చనీయాంశమైంది. దీంతో ఈ వ్యవహారాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. ఒక్క నిర్మల్ జిల్లాలోనే దాదాపు 60 మందికిపైగా మధ్యవర్తులు ఉన్నట్టు దర్యాప్తులో తేల్చారు. మొదట బోధ్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తిని విచారించిన పోలీసులు.. ఆ తర్వాత కడెం, ఖానాపూర్, నిర్మల్ ప్రాంతాలకు చెందిన 8 మంది ఉపాధ్యాయులను అదుపులోకి తీసుకున్నారు. వారందరినీ నిర్మల్‌లో కాకుండా వేరే పోలీస్ స్టేషన్‌లో రహస్యంగా విచారించారు. నిర్మల్ పాటు ఆదిలాబాద్, మంచిర్యాల, జగిత్యాల, నిజామాబాద్, కామారెడ్డి తదితర జిల్లాల్లోనూ కొనసాగిన ఈ దందాలో 1,500 మందికిపైగా బాధితులు ఉన్నట్టు అధికారులు అంచనాకు వచ్చారు.

దుబాయ్‌కి డబ్బు తరలింపుపై ఆరా

ఈ దందాలో మనీ లాండరింగ్ జరిగిందని ప్రాథమికంగా అనుమానిస్తున్న ఈడీ.. మరిన్ని వివరాల కోసం లోతుగా కూపీ లాగుతున్నది. ఒక్క నిర్మల్ ప్రాంతంలోనే దాదాపు రూ.50 కోట్లు కొల్లగొట్టినట్టు పోలీసుల దర్యాప్తులో తేలడంతో ఆ డబ్బును ఎక్కడికి తరలించారు? ఏం చేశారు? అన్న వివరాలను రాబట్టేందుకు ఈడీ ప్రయత్నిస్తున్నది. రూ.లక్ష పెట్టుబడి పెడితే నెలకు రూ.14 వేల చొప్పున వడ్డీ వస్తుందని, రూ.5 వేలు పెట్టుబడి పెట్టినా 500 రోజుల్లో రెట్టింపు చేస్తామని ఈ ముఠా నమ్మబలుకుతూ.. ఒక్కో పెట్టుబడిదారు మరో ఐదుగురిని చేర్పించాలని గొలుసుకట్టు వ్యాపారానికి తెరలేపింది. దుబాయ్‌లో ఉన్న ఈ ముఠా సూత్రధారులు ఢిల్లీలో నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకుని ఈ దందాను సాగించారని, తద్వారా కొల్లగొట్టిన డబ్బంతా దుబాయ్‌కే తరలించి ఉంటారని ఈడీ అనుమానిస్తున్నది.

ఎన్‌డీఎస్ఏతో ఇరిగేషన్‌శాఖ భేటీ

హైదరాబాద్, అక్టోబర్11 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర సాగునీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఉన్నతాధికారులు శుక్రవారం నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అధికారులతో భేటీ అయ్యారు. మేడిగడ్డ బరాజ్ ఘటనపై అధ్యయనం చేసి సిఫారసులు చేసేందుకు చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వం లో ఎన్‌డీఎస్ఏ ప్రత్యేక నిపుణుల కమిటీని ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. ఈ కమిటీ ఇప్పటికే క్షేత్రస్థాయిలో బరాజ్‌లను పరిశీలించగా, తుది నివేదికను మాత్రం ఇప్పటి వరకు సమర్పించలేదు. ఈ నేపథ్యంలో సాగునీటిపారుదల శాఖ అధికారులతో పలు సాంకేతిక అంశాలపై చర్చించారు.

ఏపీలో వైన్సులకు 85వేల దరఖాస్తులు!

హైదరాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): ఏపీలో మద్యం దుకాణాల దరఖాస్తు గడువు ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా 3,396 దుకాణాలకు 85వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్టు ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు. కొత్త మద్యం దుకాణాల దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.1700 కోట్ల ఆదాయం సమకూరింది. ఇదిలా ఉండగా ఏపీలోని మద్యం షాపులకు అమెరికా, యూరోప్ దేశాల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు వచ్చినట్టు ఏపీ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ చైతన్య మురళి తెలిపారు. చివరి రోజు శుక్రవారం ఒక్కరోజే దాదాపు 18వేల దరఖాస్తులు వచ్చినట్టు పేర్కొన్నారు.